సాక్షి శ్రీకాకుళం

మంగళవారం । 25 । ఫిబ్రవరి । 2025



ఇంటర్ పరీక్షలకు వేళాయె

ఇంటర్ పరీక్షలు మార్చి 1 నుంచి ప్రారంభం కానున్నాయి. ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

- 8లో



అనుమానాస్పద మృతి

శ్రీకాకుళంలో ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

- 8లో

పుష్పార్చన

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం నక్కవీధిలోని ఉమాజలలేశ్వర స్వామికి సోమవారం పుష్పార్చన చేశారు. రుద్రాభిషేకాలు, ఉమాదేవికి కుంకుమార్చనలు నిర్వహించారు.



న్యూస్‌రీల్

నైపుణ్య కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ మహిళా సహకార సంస్థ ఆధ్వర్యంలో ఎచ్చెర్లలో ఉన్న ఎన్‌టీఆర్ నైపుణ్య అభివృద్ధి, మహిళా సాధికారిత (మహిళా ప్రాంగణం)లో నైపుణ్య కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మేనేజర్ పి.విమల సోమవారం ప్రకటనలో తెలిపారు. బేబీ కేర్ టేకర్, వేర్ హౌస్ అసోసియేట్, ఫార్మా స్టోర్ అసోసియేట్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్, పేషెంట్ రిలేషన్స్ అసోసియేట్, కోర్సులు మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు చెప్పారు. బొల్లినేని మెడిస్కిల్స్ సహకారంతో ఈ కోర్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ పూర్తి చేసిన మహిళలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. కోర్సు సమయం 45 రోజుల నుంచి రెండు నెలల మధ్య ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం వారు కోర్సు పూర్తి చేసిన రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు ఆసక్తి, విద్యార్హత ఉన్న మహిళలు ఫోన్ నంబర్లు 7680945357, 7995013422 నంబర్లు సంప్రదించాలని తెలిపారు.

టెన్త్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: టెన్త్‌క్లాస్ పబ్లిక్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసి, విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ గొండు సీతారాం పేర్కొన్నారు. శ్రీకాకుళంలోని సమగ్రశిక్ష ప్రాజెక్ట్ జిల్లా కార్యాలయంలో సోమవారం విద్యాశాఖాధికారులు, కేజీబీవీ, మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గొండు సీతారాం మాట్లాడుతు జిల్లాలో 149 కేంద్రాల్లో జరిగే టెన్త్ పరీక్షలను 28,934 మంది రాయనున్నట్టు చెప్పారు. బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మారుమూల, గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలకు హాజరయ్యే విద్యార్థులకు రవాణా ఇబ్బందులు లేకుండా సరిపడా బస్‌లు ఏర్పాటు చేసేలా ఆర్టీసీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ పక్కాగా అమలయ్యే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. పరీక్షలకు చేపడుతున్న ఏర్పాట్లను డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య వివరించారు.

బీచ్‌లో ట్రయల్ రన్ సక్సెస్



వంశధార నది- సముద్రం కలిసే చోట పెడల్ బోటుపై విహారం

గార: మండలంలోని కె.మత్స్యలేశం పరిధిలోని పోర్టు కళింగపట్నం బీచ్ ఏరియాలో ఏపీటీడీసీ (ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్) నిర్వహించిన ఏటీవీ రైడ్ ట్రయల్ రన్ విజయవంతమైందని జిల్లా పర్యాటక శాఖాధికారి నారాయణరావు తెలిపారు. బీచ్, వంశధార నదీ సంగమంలో జరిగే ఈ రైడ్‌కు ఇప్పటికే ప్రభుత్వం అనుమతి లభించిందన్నారు. వీటికి ధరలు ఇప్పటికే నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ పర్యాటక రైడ్‌కు సంబంధించి అన్ని శాఖల అనుమతులు మంజూరయ్యాయన్నారు. ఇక్కడ స్పీడ్ బోట్‌లో ఒక వ్యక్తికి రూ. 250లు, ఏటీవీ రైడ్ (ఒక వ్యక్తి)కు రూ. 150లు, పెడల్ బోట్‌కు (ఒక్కో వ్యక్తికి) రూ. 100లుగా నిర్ణయించామని, త్వరలోనే వీటిని ప్రారంభించేందుకు చర్యలు చేపడతామన్నారు.

దాడులు.. దారుణాలు

జిల్లాలో రెచ్చిపోతున్న ఇసుక మాఫియా



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం

జిల్లాలో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. తమ ఆగడాలు అడ్డుకుంటున్న వారిపై బాహాటంగానే దాడులకు తెగబడుతోంది. గత ఏడాది సెప్టెంబర్‌లో బూర్జ మండలం కాఖండ్యాం ఇసుక ర్యాంపులో జరుగుతున్న అక్రమాలు నిగ్గు తేల్చేందుకు వెళ్లిన ననపల సురేష్ అనే వ్యక్తిపై ఇసుక మాఫియాకు చెందిన టీడీపీ నాయకులు నారాయణ పురం వద్ద దాడికి పాల్పడ్డారు. గత ఏడాది అక్టోబర్ లోనూ ఆయనను ఆమదాలవలస మండలం దూసి నుంచి వెంబడించి, శ్రీకాకుళం నగరంలోని బలగకు వచ్చాక కారులోని నుంచి బయటకు లాగి మరీ కొట్టారు. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అనుచరులు సురేష్ వాహనాన్ని ధ్వంసం చేసి, బూతులు తిట్టి, ఆయన్ని కాలువలోకి తోసేశారు. పట్టపగలు జనాలు, పోలీసులు చూస్తుండగానే ఈ తంతు జరిగింది.

> గత ఏడాది నవంబర్‌లో ట్రాక్టర్లకు ఇసుక ఉచితమని ప్రభుత్వం ప్రకటించడంతో కొన్ని ట్రాక్టర్లు ఇసుక కోసం వంశధార నదిలోని గార డీసిల్టేషన్ పాయింట్‌లోకి వెళ్తే.. నేరుగా సంబంధిత నిర్వాహకులు అడ్డుకున్నారు. తాము వేసిన బాటలోకి వస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.



శ్రీకాకుళం నడిబొడ్డున సురేష్‌పై రౌడీల వీరంగం (ఫైల్)

> గత ఏడాది డిసెంబర్‌లో ప్రధాన పత్రిక విలేకర్ల బృందం నరసన్నపేట మండలం గోపాలపెంట ఇసుక ర్యాంపులోకి వెళ్లి ఫొటోలు, వీడియోలు తీసేందుకు యత్నించగా అక్కడి ఇసుక మాఫియా దాడికి యత్నించింది.



చింతాడ రవికుమార్‌పై దౌర్జన్యం (ఫైల్)

తాజాగా పొందూరు మండలం బొడ్డేపల్లి గ్రామంలో అనధికారికంగా నడుపుతున్న ర్యాంపును పరిశీలించడానికి వెళ్లిన వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ పార్టీ శ్రేణులపై టీడీపీ ఇసుక మూకలు కర్రలు, గడ్డపారలతో దాడికి యత్నించాయి. దాడికి యత్నించిన వారంతా ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అనుచరులని, ఇసుక అక్రమ రవాణా ద్వారా కూన రవికుమార్ రోజుకి రూ.కోటి సంపాదిస్తున్నారని, అడ్డగోలు సంపాదనకు కక్కుర్తి పడి, ఇసుక అక్రమాలను అడ్డుకుంటున్న వారిపై దాష్టీకానికి దిగుతున్నారని చింతాడ రవికుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

జిల్లాలో ఇసుక మాఫియా ఏ స్థాయిలో రెచ్చిపోతుందో, ఎంతకు బరితెగిస్తుందో పైఘటనలు చూస్తే అర్థమవుతోంది.

చంపేస్తామంటూ బెదిరింపులు..

2014–19లో ఎలాగైతే దాడులకు తెగబడి, అక్రమంగా ఇసుక ర్యాంపులు ప్రారంభించి రూ.వేల కోట్లు సంపాదించారో, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ అదే రకంగా రెచ్చిపోతున్నారు. రూ.వేల కోట్లు ఆర్జిస్తున్నారు. అధికార యంత్రాంగం కళ్లు మూసుకుని చూడటం తప్ప చేసిందేమీ లేదు. ముఖ్యంగా ఆమదాలవలస నియోజకవర్గంలోనైతే అక్రమ తవ్వకాలను అడ్డుకుంటే చంపేస్తామని బెదిరింపులకు సైతం దిగుతున్నారు. అడ్డొస్తే నరికేస్తామని బెదిరిస్తున్నారు. దాడులకు తెగబడుతున్న వారంతా కూన రవికుమార్ అనుచరులే కావడంతో ఎదురు లేకుండా పోతోంది.

అక్రమ తవ్వకాలు.. రవాణా

- ఆమదాలవలస నియోజకవర్గంలోనే తీసుకుంటే దూసి, ఇసుకలపేట, దిబ్బలపేట, తొగరాం, కొత్తవలస, నిమ్మతొర్లాడ, పాతూరు, నారాయణపురం, అక్కివరం, బెలమం, లొద్దలపేట, కొరపాం, తోటాడ, సింగూరు, చెవ్వాకులపేట, సవలాపురం, బొడ్డేపల్లి తదితర అనేక గ్రామాల నదీ తీరాల్లో ఇసుకను దోచేస్తున్నారు. పట్టపగలే తవ్వకాలు చేసేస్తున్నారు. రాత్రి పూట రవాణా చేస్తున్నారు. గ్రీన్ ట్రిబ్యునల్ ఉత్తర్వులను బేఖాతరు చేసి రహదారి వంతెనలు, రైల్వే వంతెనలకు సమీపంలోనే ఇసుక తవ్వకాలు చేస్తున్నారు.
- శ్రీకాకుళం నియోజకవర్గంలోని బైరి, కరజాడ, బూరవల్లి, కళ్లేపల్లి, కిల్లిపాలెం, పొన్నాం, బట్టేరు, నైరా, గార ప్రాంతాల్లో..
- నరసన్నపేట నియోజకవర్గంలోని మడపాం, పర్లాం, రామకృష్ణాపురం, శ్రీముఖలింగం, దొంపాక, లుకలాం, బుచ్చిపేట, ఉర్లాం, చేనులవలస, గోపాలపెంట..
- పాతపట్నం నియోజకవర్గంలోని కొత్తూరు, హిరమండలం మండలాల్లోని పలు గ్రామాల నదీ తీరాల్లో ఇసుక దందా సాగుతోంది. డీసిల్టేషన్ పాయింట్‌లకు ఇచ్చిన అనుమతులు ముగిసినా కూడా తవ్వకాలు ఆపడం లేదు.

గడువు ముగిసిన గార, బట్టేరు, కాఖండ్యాం, ముద్దాడపేట రీచ్‌ల్లో ప్రస్తుతం ఇదే జరుగుతోంది.

- ఇసుక అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణా అడ్డుకుంటే దాడులకు తెగబడుతున్న టీడీపీ మూకలు
- ఆ మధ్య నారాయణపురం, శ్రీకాకుళంలో ననపల సురేష్‌ను వెంటబడి కొట్టిన ఎమ్మెల్యే కూన రవి అనుచరులు
- గోపాలపెంటలో విలేకర్ల బృందంపై దాడికి యత్నం
- తాజాగా బొడ్డేపల్లిలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్, పార్టీ శ్రేణులపై కర్రలు, పారలతో దాడికి యత్నం
- చోద్యం చూస్తున్న అధికారులు

నకిలీ బిల్లులు ఆధారంగా..

జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలతో నిర్వాహకులకు రూ.కోట్లు కుమ్మరిస్తుంటే వారికి సహకరిస్తున్న అధికార వర్గాలకు జేబులు నిండుతున్నాయి. అక్రమ రవాణా కోసం ఏకంగా నకిలీ బిల్లులు సృష్టించారు. అధునాతన పరికరంతో నకిలీ బిల్లులను తయారు చేసి, అక్రమ రవాణాకు రాచబాట వేస్తున్నారు. ఇదంతా గూడు పుఠాణీగా సాగిపోతోంది. ఇక నకిలీ బిల్లులతో రవాణా చేస్తున్న లారీలను క్షుణ్ణంగా తనిఖీ చేయకుండా లంచావతారం ఎత్తిన ఓ అధికారి జిల్లా సరిహద్దులను దాటించేస్తున్నారు. అంతా కలిసి కుమ్మక్కై, పథకం ప్రకారం ఇసుక అక్రమ బాగోతాన్ని నడుపుతున్నారు.



శ్రీకాకుళంలో పట్టపగలు సురేష్‌పై దాడి చేసి కాలువలోకి తోసేసిన వైనం (ఫైల్)

శనగకు జలం.. రైతన్నకు జలపుష్పం



మోటార్లతో నీటిని తోడుతూ..

పాతతలగాం పంచాయతీ ఉద్దండపాలెంలో రైతులు సోమవారం బిజీబిజీగా గడిపారు. వేరుశనగకు నీరు పెట్టడానికి 26 మోటార్లతో మర్రిబంద కోనేరులో నీటిని ఉదయం తోడారు. చెరువు నీరు అడుగంటడంతో మధ్యాహ్నం చేపలు పట్టారు.

– సంతబొమ్మాళి



తోడిన తరువాత చేపలు పడుతూ..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సన్నద్ధం

- జిల్లాలో 5035 మంది ఓటర్లు
- 31 పోలింగ్ కేంద్రాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉత్తరాంధ్ర పరిధిలోని విశాఖపట్టణం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాలకు సంబంధించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఫిబ్రవరి 27వ తేదీన జరగనుంది. దీనికోసం జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. జిల్లాలో ఈ ఎన్నికలకు గాను 5035 మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ కోసం 31 కేంద్రాలు సిద్ధం చేశారు. ఫిబ్రవరి 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. మొత్తం పది మంది పోటీలో ఉన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్ని చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో పురుష ఓటర్లు 3416, కాగా మహిళా ఓటర్లు 1619 మంది ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పర్యవేక్షణ కోసం ఎంపీడీఓ, వీడియో గ్రాఫర్‌తో కూడిన 30 ఎంసీసీ బృందాలను మండలానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేశారు. మండలానికి ఒకటి చొప్పున తహసీల్దార్, ఎస్ఐ, వీడియోగ్రాఫర్‌తో 30 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు మార్చి 3న జరగనుంది. ఎన్నికల నియమావళి (కోడ్) మార్చి 8వ తేదీతో పూర్తి కానుంది.



మాట్లాడుతున్న డీఆర్ఓ వెంకటేశ్వరరావు

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విధులపై సంబంధిత పోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సహాయ ఎన్నికల అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ సిబ్బంది రెండో విడత శిక్షణ తరగతులు నిర్వహించారు. బ్యాలెట్ బాక్సులు తెరవడం, సీల్ చేయడం వంటి అంశాలపై క్షుణంగా అవగాహన కల్పించారు. బ్యాలెట్ పేపర్‌ను ఏ విధంగా మడతపెట్టి బ్యాలెట్ బాక్సులో వేయాలో వివరించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లాలో 5,035 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకుంటారని, ఇందులో పురుషులు 3,416 మంది కాగా మహిళలు 1619 మంది ఉన్నారని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పూర్తిగా చదివి అవగాహనతో పకడ్బందీగా, నిష్పక్షపాతంగా పోలింగ్ ప్రక్రియను ముగించాలని తెలిపారు.

బీఆర్‌ఏయూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అనుకూల ఉత్తర్వులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో గత ఏడాది డిసెంబర్ 31వ తేదీన ఏడాది పనిచేసిన 34 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను వర్సిటీ అధికారులు తొలగించారు. దీంతో వీరు జనవరి 2వ తేదీన లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు లేబర్ కమిషన్ వర్సిటీ అధికారులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో ఒప్పందం కుదుర్చుకున్న గుంటూరు జిల్లా తాడేపల్లి ఏజీఎస్ మేనేజ్ మెంట్‌లకు నోటీసులు జారీ చేసి పలు మార్లు వారి వివరణ తీసుకున్నారు. మూడు వర్గాల వాదనలు పలు మార్లు విన్న అసిస్టెంట్ లేబర్ కమిషన్ బాధితులకు అనుకూల ఉత్తర్వులు సోమవారం వెలువరించారు. వర్సిటీకి, బాధితులకు ఈ ఉత్తర్వులు మంగళవారం అందజేయనున్నారు. ఉత్తర్వులు వర్సిటీ అధికారులు అమలు చేస్తారా? లేదా? అన్నది చూడాలి.

మహాశివరాత్రి పూజలకు ముస్తాబైన టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జునస్వామి దేవస్థానం





మహాశివరాత్రి పూజలకు సిద్ధమైన ఎండల మల్లికార్జునస్వామి

కలియుగ కైలాసం

పైకప్పు లేని శైవక్షేత్రం, ప్రపంచంలోనే ఎత్తైన స్వయం భూలింగం, అత్యంత ప్రాచీన సుమేరు పర్వతం.. కలగలిపి రావివలస ఎండల మల్లన్న క్షేత్రం. శివరాత్రి నుంచి మొదలుకుని మూడు రోజుల పాటు ఇక్కడ శివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఆలయ కార్య నిర్వహణాధికారి జి.గురునాథరావు పర్యవేక్షణలో ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, లింగోద్భవం కార్యక్రమాలు నిర్వహిస్తారు. 27 గురువారం నిత్య అర్చనలతో పాటు మల్లన్నకు విభూది భస్మాలంకరణ పూజలు చేయనున్నారు. 28 శుక్రవారం స్వామి వారి తిరువీధి, చక్రతీర్థ స్నానాలు నిర్వహిస్తారు.

చేరుకునే మార్గాలివే..

ఎండల మల్లన్న ఆలయానికి రోడ్డు, రైల్వే మార్గాలు ఉన్నాయి. శ్రీకాకుళం నుంచి టెక్కలి చేరుకుంటే.. అక్కడ నుంచి 4 కిలోమీటర్ల దూరంలో గల ఈ ఆలయానికి వెళ్లేందుకు ప్రైవేటు వాహనాలు ఉంటాయి. రైల్వే మార్గం విషయానికి వస్తే టెక్కలితో పాటు సమీపంలో సుమారు 5 కిలోమీటర్ల దూరంలో నౌపడ రైల్వే స్టేషన్, 20 కిలోమీటర్ల దూరంలో పలాస రైల్వే స్టేషన్‌కు రైల్వే మార్గంలో చేరుకుని అక్కడి నుంచి చిన్నపాటి వాహనాల్లో ఈ ఆలయానికి చేరుకోవచ్చు. – టెక్కలి

సుమనోహర గాథలు



శివరాత్రి ప్రత్యేకం

అవి కేవలం ఆలయాలు కాదు.. అనాది కాలపు ఆనవాళ్లు. అవి కేవలం విగ్రహాలు కావు.. ఘన సాంస్కృతిక చరితకు సాక్ష్యాలు. ఆ గాలుల్లో పంచాక్షర మంత్రాలు ప్రతిధ్వనిస్తుంటాయి. ఆ నీళ్లలో పంచామృత ధారలు కలిసి ప్రవహిస్తుంటాయి. ఆ మట్టి రేణువుల్లో మహాదేవుడి ప్రతిబింబాలు కనిపిస్తుంటాయి. ఈ శివరాత్రికి ఆ కథలు తెలుసుకుందాం. జాగరణ క్రతువులో మన కోవెల కథలు పారాయణంగా చెప్పుకుందాం.

బ్రహ్మసూత్ర శివలింగాలు



భీమేశ్వర స్వామి



సోమేశ్వర స్వామి



వరుణేశ్వరుడు



ఈశాన్య ఈశ్వరుడు



ఎండల మల్లికార్జునుడు

శ్రీముఖలింగం దక్షిణ కాశీగా ఎప్పటి నుంచో ఖ్యాతి పొందింది. ఇక్కడ అరుదైన బ్రహ్మసూత్ర శివలింగాలు ఐదు ఒకే చోట కొలువై ఉన్నాయి. బ్రహ్మజ్ఞాన తత్పరులైన మహర్షులు స్థాపించి నిత్య పూజలందుకునే శివలింగాలను బ్రహ్మసూత్ర శివలింగాలు అంటారు. భీమేశ్వర, సోమేశ్వర, వరుణేశ్వర, ఈశాన్య ఈశ్వర, ఎండల మల్లికార్జున లింగాలు ఇక్కడ దర్శనమిస్తాయి. దేశం మొత్తం మీద ఇలాంటివి చాలా అరుదు. శ్రీముఖలింగంలో ముఖాకృతిలో లింగం దర్శనం ఇవ్వడం ప్రత్యేకత. ఇక్కడ జరిగే మహాశివరాత్రి ఉత్సవాల్లో పాల్గొనేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. కృతయగంలో గోవిందేశ్వరుడు అనే నామంతో కనకాకృతిలోను, త్రేతాయగంలో మధుకేశ్వరుడనే నామంతో రజతాకృతి లోను, ద్వాపర యగంలో జయంతేశ్వరుడనే నామంతో కాంస్యాకృతిలోను, కలియగంలో ముఖలింగేశ్వరుడనే పేరుతో ముఖం దాల్చి శిలాకృతిలో శివుడు శ్రీముఖలింగం క్షేత్రంలో దర్శనమిస్తున్నారు. జిల్లా నలుమూలల నుంచి శ్రీముఖలింగానికి రవాణా సదుపాయం ఉంది. –జలుమూరు

బలరామ ప్రతిష్ఠితం



ఉమారుద్ర కోటేశ్వరుడు

శ్రీకాకుళం కల్చరల్: పవిత్ర నాగావళి తీరం, పురాతన ఆలయ నిర్మాణం, బలరామ ప్రతిష్ఠిత శివలింగం.. వెరసి ఉమారుద్రకోటేశ్వర స్వామి ఆలయం. ద్వాపర యుగాంతంలో నిర్మితమైన ఈ ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. బలరామ ప్రతిష్ఠితములైన పంచలింగాల ప్రాంతం కావడంతో పంచలింగ క్షేత్రంగానూ పరిఢవిల్లుతోంది. ఆలయంలో ఉత్సవాలకు అర్చకులు శ్రీరామమూర్తి, ఈఓ సర్వేశ్వరరావు ఏర్పాట్లు చేస్తున్నారు. శివరాత్రి రోజున రాత్రి 12గంటలకు లింగోద్భవ పూజలు జరుగుతాయని, తెల్లవారు 3గంటలకు స్వామివారి ఊరేగింపు నందివాహనంపై ఉంటుందని తెలిపారు.

భక్తుల కొంగు బంగారం

శ్రీకాకుళం నక్కవీధిలోని ఉమాజలలేశ్వర స్వామి ఆలయం ఉంది. భస్మాంగుల వంశస్తులు ఈ ఆలయాన్ని నెలకొల్పినట్లు చరిత్ర చెబుతోంది. శివరాత్రి పర్వదినం రోజున ఏకాహం, లింగోద్భవ కాలంలో లింగాభరణం నిర్వహిస్తారు.

బావిలోని విగ్రహాలు బయటకు తీసి..

శ్రీకాకుళం గుజరాతీపేటలో ఉన్న ఉమా లక్ష్మేశ్వర స్వామి ఆలయం కూడా అతిపురాతనమైనది. 300 ఏళ్ల కిందట మహారాష్ట్ర నుంచి వచ్చిన ఒక స్వామీజీ నాగావళి నది పొంగి ఉండగా ఇక్కడ బస చేశారు. ఆ సమయంలోనదీ ప్రాంగణంలోని ఒక నూతిలో ముస్లింరాజు పారేసిన విగ్రహాలు ఉన్నట్లు తెలుసుకున్నారు. అందులో విగ్రహాలు బయటకు తీసి జీర్ణోద్ధరణ చేశారు. ఆ తర్వాత ఆలయాన్ని సుందరంగా నిర్మించి అర్చనాదులు నిర్వహిస్తున్నారు.

250 ఏళ్లుగా..

శ్రీకాకుళంలోని కొన్నావీధిలో భీమేశ్వరుడు 250 ఏళ్లుగా పూజలు అందుకుంటున్నాడు. లోతైన గర్భగుడి, పెద్ద శివలింగం, లింగంపై నాటి ధారాపాత్ర.. వంటివి ఇక్కడి ప్రత్యేకతలు. శివరాత్రి నాడు ఉదయం నుంచి రుద్రాభిషేకాలు, క్షీరాభిషేకాలు ఉంటాయని ఆలయ ఈఓ మాధవి, అర్చకులు గంట చిన్న రామ్మూర్తి తెలిపారు.



లక్ష్మేశ్వర స్వామి



బోడెమ్మ కోవెలలో జీవేశ్వరాలయం

క్లుప్తంగా

అదనంగా వసూలు చేస్తే చర్యలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: గ్యాస్ డోర్ డెలివరీ పేరిట వినియోగదారుల నుంచి అదనపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ హెచ్చరించారు. జిల్లా సప్లయ్ అధికారి, గ్యాస్ ఏజెన్సీల డీలర్లతో కలెక్టరేట్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. గ్యాస్ డెలివరీ సమయంలో వినియోగదారుల నుంచి అదనంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇక నుంచి ఫిర్యాదులు వస్తే సంబంధిత ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వినియోగదారులకు న్యాయం చేయడమే లక్ష్యంగా ఏజెన్సీలు పనిచేయాలని సూచించారు. సమావేశంలో డీఎస్‌వో సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని ఆందోళన


ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బాధితులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి సూదికొండ 51వ సర్వే నంబర్‌లో కేంద్రీయ విద్యాలయం నిర్మాణానికి భూసేకరణ వివాదంగా మారిన విషయం తెలిసిందే. దీంతో తమకు న్యాయం చేయాలని సుమారు 120 మంది బాధితులు కోరుతున్నారు. ఈ మేరకు వీరంతా సోమవారం ఉదయం పలాసలోని ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ముందు నిరసన తెలిపారు. కేంద్రీయ విద్యాలయానికి తాము అడ్డు చెప్పడం లేదని, అయితే తమ స్థలాలు తీసుకున్నందున న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అక్కడ అనేక మంది పెద్దల స్థలాలు ఉండగా తమవే ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సూదికొండ ప్రాంతానికి చెందిన అనేక మంది బాధితులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు


చికిత్స పొందుతున్న అభిరామ్

టెక్కలి రూరల్: మండలంలో లచ్చన్నపేట గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై ఉన్న సంకెళ్లమెట్ట మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. టెక్కలి మండలంలోని జయకృష్ణాపురం గ్రామానికి చెందిన బెండి అభిరామ్ అనే యువకుడు, తన కళాశాలలో జరుగుతున్న కార్యక్రమానికి స్నేహితుడిని తీసుకెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై నందిగాం మండలం తామరాపల్లి సోమవారం వెళ్లాడు. అనంతరం తిరిగి తన స్నేహితుడితో కలిసి వస్తుండగా సంకెళ్లమెట్ట వద్ద తన ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో అభిరామ్‌కు తీవ్రగాయాలయ్యాయి. దీంతో అతడిని వెంటనే టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి, మెరుగైన వైద్యం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు.

ఇంటర్ పరీక్షలకు వేళాయె..!

- మార్చి 1వ తేదీ నుంచి పరీక్షలు
- జిల్లాకు చేరుకున్న ప్రశ్నాపత్రాలు
- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు


జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం

శ్రీకాకుళం న్యూకాలనీ:

విద్యార్థులకు పరీక్షల సమ యం ఆసన్నమైంది. మార్చి 1వ తేదీ నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు జిల్లాలో శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. పరీక్ష నిర్వహణకు సంబంధించిన ఓఎంఆర్‌లు, ఎన్ఆర్‌లు, జవాబుపత్రాలు, స్టిక్కర్లు వంటి సామగ్రి పరీక్ష కేంద్రాలకు అధికారులు చేరవేశారు. ప్రశ్నాపత్రాలు పోలీసు పహారా నడుమ జిల్లాకు చేరుకున్నాయి. జిల్లా స్పెషల్ ఆఫీసర్, డీవీఈవో శివ్వాల తవిటినాయుడు ఆధ్వర్యంలో ఆర్ఐఓ/డీఈసీ కన్వీనర్ ప్రగడ దుర్గారావు నేతృత్వంలో డీఈసీ కమిటీ సభ్యులు ఏర్పాట్లలో పూర్తి స్థాయిలో నిమగ్నమయ్యారు.


పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు

సిబ్బంది నియామకం

జిల్లాలోని 75 కేంద్రాల్లో జరగనున్న పరీక్షలకు 75 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, 31 మంది కస్టోడియన్లను నియమించారు. అలాగే 4 సిట్టింగ్, 4 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను తనిఖీల కోసం ఏర్పాటు చేశారు. 1,600 మంది వరకు ఇన్విజిలేటర్లను వినియోగిస్తున్నారు. వీరందరికీ నియామక ఉత్తర్వులు సైతం అందజేశారు. నియామకమైన వారితో ఇప్పటికే అధికారులు కీలక సమావేశాన్ని నిర్వహించారు.

పక్కాగా ఏర్పాట్లు



జిల్లాలో ఇంటర్ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నాం. ఇంటర్ బోర్డు డైరెక్టర్ ఆదేశాలు, జిల్లా కలెక్టర్ సూచనల మేరకు విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్షలు రాసేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అందరూ సహకరించి విజయవంతం చేయాలి. జిల్లాలో మొత్తం 75 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయి. పరీక్ష కేంద్రాలకు మెటీరియల్స్‌ను చేరవేశాం. హాల్ టిక్కెట్లు బోర్డు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి.

– ప్రగడ దుర్గారావు, ఆర్ఐవో, డీఈసీ కన్వీనర్

40,356 మంది విద్యార్థులు

ఇంటర్మీడియట్ పరీక్షలకు గతేడాది 83 కేంద్రాలను కేటాయించగా.. ఈ ఏడాది 8 కేంద్రాలను కుదించి 75 కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలే అత్యధికంగా ఉన్నాయి. గత ప్రభుత్వం నాడు-నేడు ద్వారా సమకూర్చిన వసతులు కలిగి ఉండడంతో అధిక ప్రాధాన్యత వాటికే ఇచ్చారు. కాగా జిల్లావ్యాప్తంగా ఈ పరీక్షలకు 40,356 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 37,956 మంది, ఒకేషనల్ విద్యార్థులు 2,380 మంది ఉన్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం 20,389 మంది, ద్వితీయ సంవత్సరం చదువుతున్నవారు 19,967 మంది ఉన్నారు.

పరీక్ష కేంద్రాలపై దృష్టి

ఇదిలా ఉండగా ప్రభుత్వ ఆదేశాల మేరకు పరీక్ష కేంద్రాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో మొత్తం 1,480 సీసీ కెమెరాలను అమర్చారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌తో పాటు పోలీసు బందోబస్తు కల్పించనున్నారు. అన్ని కేంద్రాల్లో పూర్తిస్థాయిలో ఫర్నీచర్ ఉండేలా, అలాగే నిరంతర విద్యుత్‌ను కలిగి ఫ్యాన్లు, లైటింగ్ ఉండేలా చర్యలు చేపట్టారు. ఎంపిక చేసిన 15 రూట్లలో ఆర్టీసీ బస్సులను ప్రత్యేకంగా నడిపించేలా పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నారు.



పరీక్ష కేంద్రాలు	పరీక్ష రాయనున్న విద్యార్థులు	ప్రథమ సంవత్సరం	ద్వితీయ సంవత్సరం	ఒకేషనల్
75	40,356 మంది	20,389 మంది	19,967 మంది	2.380 మంది

సీఎస్‌లు, డీవోలు	కస్టోడియన్లు	ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు	సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు	ఇన్విజిలేటర్లు	సీసీ కెమెరాలు
75 మంది	31 మంది	4	4	1,600 మంది	సుమారు 1,480

మాజీ గ్రామ వలంటీర్‌పై దాడి

- దాడికి పాల్పడింది టీడీపీ కార్యకర్త


అప్పన్నను పరామర్శిస్తున్న పేరాడ తిలక్

టెక్కలి/టెక్కలి రూరల్: మండలంలోని చాకిపల్లి గ్రామంలో మాజీ గ్రామ వలంటీర్ జలుమూరు అప్పన్నపై అదే గ్రామానికి చెందిన పంగ వెంకట్రావు సోమవారం దాడికి పాల్పడ్డాడు. ఆస్తి తగాదాను అదునుగా చేసుకుని అదే స్థలంలో కోళ్లగూడు ఉంచాడనే నెపంతో దాడి చేశాడు. దీంతో తీవ్ర గాయాలతో అప్పన్న టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేరాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గ్రామంలోని కొంతమంది టీడీపీ నాయకుల ప్రోద్బలంతోనే వెంకట్రావు తనపై దాడి చేసేందుకు పన్నాగం పన్నాడని వాపోయాడు. తనకు న్యాయం చేయాలని కోరారు. అయితే ఇదిలా ఉండగా అప్పన్న తనపై దాడి చేశాడంటూ వెంకట్రావు సైతం ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు.

అండగా ఉంటాను.. అధైర్య పడొద్దు

టీడీపీ కార్యకర్త దాడిలో గాయపడిన మాజీ వలంటీర్ జలుమూరు అప్పన్నను వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ పరామర్శించారు. టెక్కలి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అప్పన్నను పరామర్శించి దాడికి గల కారణాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ.. టెక్కలి నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలు పథకం ప్రకారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, దళితులపై దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. దాడికి పాల్పడిన ఏ ఒక్కరినీ విడిచిపెట్టేది లేదని హెచ్చరించారు. దాడికి గురైన ప్రతి కార్యకర్తకూ అండగా నిలబడి న్యాయ పోరాటం చేస్తానని భరోసానిచ్చారు. ఆయనతో పాటు మాజీ ఏఎంసీ చైర్మన్ చుక్క గున్నమ్మ, సర్పంచ్‌లు ఎం.శంకర్, కె.కామేష్, వి.తవితయ్య, నాయకులు బి.భాస్కరరావు, పి.శ్రీను, సత్తారు సత్యం తదితరులు ఉన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ ఈశ్వరరావు

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం నగరంలోని బలగ టీఎ స్టేట్ కాలనీలో మజ్జి రమేష్‌నాయుడు (34) అనే యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. సోమవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు వివరాలు వెల్లడించారు. మృతుడికి 14 ఏళ్ల క్రితం రాయగడకు చెందిన శశి అనే యువతితో వివాహమైంది. వీరికి ఏడో తరగతి చదువుతున్న కుమార్తె, ఐదో తరగతి చదువుతున్న కుమారుడున్నారు. టీఎస్టేట్ కాలనీలో కుటుంబంతో కలిసి అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. రమేష్‌నాయుడుకు మద్యం అలవాటుండడంతో ఎప్పటికప్పుడు భార్యను అనుమానించి వేధించేవాడు. దీనిపై అప్పట్లో మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు సైతం చేసింది. ఈ క్రమంలో భర్త పెట్టే బాధలు భరించలేక సంవత్సరం క్రితం శశి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అనంతరం ఇరుపక్కల పెద్దలు నచ్చజెప్పడంతో గొడవలు సద్దుమణిగాయి. కాగా ఈ ఏడాది జనవరి 3వ తేదీ రమేష్‌నాయుడు మద్యం సేవించి ఇంటికొచ్చి భార్యను కొట్టడంతో మరలా రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే ఆదివారం మళ్లీ రమేష్ మద్యం సేవించి వచ్చి గొడవపెట్టాడు. దీంతో ఇంటి ఓనర్ 100కు ఫోన్‌చేసి ప్రతిరోజూ న్యూసెన్స్ జరుగుతోందని చెప్పడంతో పోలీసులొచ్చి భార్యభర్తలకు సర్దిచెప్పి వెళ్లిపోయారు.

ఏం జరిగింది..?

కాగా సోమవారం ఉదయం రమేష్ హడ్కో కాలనీ నివాసముంటున్న తల్లి వద్దకు వెళ్లి రూ.100లు అడిగాడు. అనంతరం మద్యం బాటిల్‌తో ఇంటికొచ్చి గొడవపడ్డాడు. అయితే పిల్లలు స్కూల్‌కు వెళ్లిన అనంతరం శశి పనిమీద బయటకు వెళ్లింది. అనంతరం ఆమె ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు బిగించి ఉండడంతో తలుపులపై గట్టిగా కొట్టింది. ఎంతకీ తెరవకపోవడంతో హడ్కో కాలనీలో ఉంటున్న అత్త దివ్య వద్దకు వెళ్లి విషయం చెప్పింది. అనంతరం ఇద్దరూ వచ్చి సైడ్ డోర్ తీసి చూడగా అపస్మారక స్థితిలో రమేష్‌నాయుడు పడిపోయి ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారమందించగా క్లూస్‌టీమ్‌తో సహా వచ్చిన సీఐ ఈశ్వరరావు, సిబ్బంది చుట్టుపక్కల పరిసరాలు క్షుణ్ణంగా పరిశీలించారు. రూమ్‌లో ఫ్యాన్లు లేకపోవడం, మృతుని మెడ కుడివైపు నుంచి ఎడమ భాగం వైపు బాగా ఒత్తినట్లు ఎరుపు మార్కింగ్ ఉండడం (తాడుతో లేదా చున్నీతో బిగించినట్లు), కుడివైపు రిబ్స్ మీద గీతలుండడం గమనించారు. మృతుని తల్లి దివ్య తన కోడలు శశిమీద అనుమానముందంటూ చెప్పడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం


రోదిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

సోంపేట: మండలంలోని సుంకిడి పంచాయతీ సవర కొరంజిభద్ర గ్రామంలో ఒక ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సవర లక్ష్మి ఇంట్లో సోమవారం ఉదయం మంటలు చెలరేగాయి. దీంతో ఇల్లు, సమీపంలోని ఆవులశాల పూర్తిగా దగ్ధమయ్యాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ధాన్యం, సర్టిఫికెట్లు, నగదు, బంగారం తదితర విలువైన వస్తువులు కాలి బూడిదయ్యాయి. స్థానికుల సమాచారంతో సోంపేట అగ్నిమాపక శాఖాధికారి ఎస్.మోహనరావు, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. షార్ట్ సర్క్యూట్ వలనే ప్రమాదం జరిగి ఉంటుందని పేర్కొన్నారు. దీంతో నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

గుడి తొలగింపు

- అధికారులతో భక్తుల వాగ్వాదం


అధికారులతో గొడవ పడుతున్న భక్తులు

టెక్కలి రూరల్: స్థానిక పట్టుమహాదేవి కోనేరు గట్టు అభివృద్ధిలో భాగంగా చెరువు గట్టుపై ఉన్న ఆక్రమణలు తొలగించే కార్యక్రమాన్ని అధికారులు సోమవారం చేపట్టారు. దీనిలో భాగంగా నిర్మాణంలో ఉన్న మా బంకేశ్వరి అమ్మవారి గుడిని తొలగించారు. దీంతో టెక్కలిలోని చిన్న చేరివీధికి చెందిన సుమారు 30 మంది భక్తులు అక్కడికి చేరుకుని పనులను అడ్డగించారు. తమ దేవత గుడిని తొలగించడం సరికాదన్నారు. అనంతరం అక్కడికి చేరుకున్న ఇన్‌చార్జి తహసీల్దార్ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి జగన్నాథరావుతో వాగ్వాదానికి దిగారు. తమ పూర్వీకుల నుంచి గట్టుపై ఉన్నటువంటి రావి, వేప, మర్రిచెట్లను కలిపి అమ్మవారిగా పూజిస్తున్నామన్నారు. ఏడాది క్రితం చందాలు వేసుకొని గుడి నిర్మాణ పనులు చేపట్టామని తెలియజేశారు. తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా గుడి తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అయితే చెరువు గట్టు అభివృద్ధిలో భాగంగా ఆక్రమణలో ఉన్న కొంత భాగమే తొలగించామని అధికారులు తెలిపారు. దేవుడిగా పూజించే చెట్లను తొలగించలేదన్నారు. అయితే భక్తులు మాత్రం తమ గుడిని మరలా పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడతామని తహసీల్దార్ వెల్లడించారు. దీంతో గొడవ సద్దుమణిగింది.

పనుల్లో నాణ్యతెంత..?



పాతపట్నం నుంచి మెళియాపుట్టి వచ్చే ఆల్ ఆంధ్రా రహదారిలో ఇటీవల సుమారు రూ.56 లక్షలతో మరమ్మతులు చేపట్టారు. దీంతో ఆయా పనులను మెళియాపుట్టి మండలంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం పరిశీలించారు. అంచనా ప్రాప్తికి కొలతల ప్రకారం పనులు చేశారో.. లేదోనని నాణ్యతను తనిఖీ చేశారు. అలాగే సుందరాడ గ్రామం వద్ద అసంపూర్తిగా ఉన్న బెర్మ్‌లను పరిశీలించి అధికారులను ప్రశ్నించారు. ఉపాధి అధికారులతో మాట్లాడి ఉపాధి నిధులతో రహదారులకు ఇరువైపులా మట్టివేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆయనతో పాటు ఆర్అండ్‌బీ ఎస్ఈ జాన్ సాగర్, ఈఈ రవినాయక్, డీఈ ఎంఎల్‌వీ సాగర్, జేఈలు నాయుడు, యోగి, తహసీల్దార్ పాపారావు, ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా ఉన్నారు. – మెళియాపుట్టి

నలుగురు గంజాయి స్మగ్లర్లు అరెస్టు

- 21.610 కేజీల గంజాయి స్వాధీనం
- ఒడిశా నుంచి తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వి.వెంకట అప్పారావు, పక్కనే సీఐ మీసాల చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి గంజాయిని అక్రమంగా మహారాష్ట్రకు తరలించేందుకు ప్రయత్నించిన నలుగురు గంజాయి స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు తెలిపారు. ఈ మేరకు స్థానిక సీఐ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒడిశాలోని గజపతి జిల్లా ఆటలిమా గ్రామానికి చెందిన అంటూని బీర అనే వ్యక్తి మహారాష్ట్రలోని జల్నా ప్రాంతంలో గంజాయి వ్యాపారం చేస్తున్న అశోక్ హివాల్ అలియాస్ రాజుకి గంజాయి సరఫరా చేయడానికి పూనుకున్నాడు. దీనికోసం ఒక ట్రిప్పుకి రూ.5 వేలు చొప్పున తీసుకునేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీనిలో భాగంగా ఒడిశాలోని కొండ ప్రాంతాల్లో 21.610 కేజీల గంజాయిని కొనుగోలు చేశాడు. అనంతరం అదే గ్రామానికి చెందిన తపన బీర్ సాయంతో ఒడిశా నుంచి ఆంధ్ర తరలించాలని ప్లాన్ చేశాడు. అనంతరం ఆంధ్రా నుంచి మహారాష్ట్రకు ఆటలిమా గ్రామానికి చెందిన ఆకాష్ బీర్, గజపతి జిల్లా అడవ పీఎస్ మండీమీరా గ్రామానికి చెందిన పిల్సా బర్ధాన్‌లతో తరలించేందుకు సిద్ధమయ్యాడు. ఈ మేరకు సోమవారం అంటూని బీర్, తపన బీర్‌లు జాతీయ రహదారి-16 మీదుగా సోమవారం ఆంధ్రకు గంజాయి తీసుకొచ్చేందుకు పయనమయ్యారు. ఆ సమయంలో కవిటి పోలీస్‌స్టేషన్ పరిధి ఆర్.బెలగాం ఫ్లై ఓవర్ అండర్ పాస్ కూడలి వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు పట్టుబడ్డారు. వారి సమాచారంతో మహారాష్ట్ర తరలించేందుకు సిద్ధంగా ఉన్నటువంటి మరో ఇద్దరిని పట్టుకున్నారు. ఈ ఘటనలో నిందితుల నుంచి 21.610 కేజీల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో సీఐ మీసాల చిన్నంనాయుడు, కవిటి ఎస్ఐ రవివర్మ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీవోతో పాటు సిబ్బందికి మెమోలు

సాక్షి ఎఫెక్ట్...

సంతబొమ్మాళి: మండల ఎంపీడీవో జయంతిప్రసాద్‌తో పాటు సిబ్బందికి మెమోలు జారీ చేసినట్లు డిప్యూటీ సీఈవో సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18వ తేదీన సమయ పాలన పాటించని ఉద్యోగులు అనే శీర్షికతో సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. దీనిలో భాగంగా 20వ తేదీన ఎంపీడీవో కార్యాలయంలో జెడ్పీ డిప్యూటీ సీఈవో సత్యనారాయణ విచారణ చేపట్టారు. అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. కార్యాలయంలో ఎంపీడీవోతో పాటు ఇతర సిబ్బంది సమయపాలన పాటించడం లేదని తేలడంతో చర్యలు తీసుకున్నారు.

ఏబీసీ కెనాల్‌లో పడి శ్రీకాకుళం వాసి గల్లంతు

- శ్రీశైలం బయల్దేరిన శివదీక్షధారి


దాసరి మోహన్‌రావు (పాతచిత్రం)

శావల్యాపురం:


పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం గంటావారిపాలెం గ్రామ సమీపంలో అద్దంకి బ్రాంచ్ కెనాల్ మెట్ల మార్గంలో స్నానం చేస్తుండగా కాలు జారి శివమాలధారణలో ఉన్న వ్యక్తి గల్లంతు అయిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం దాసరిపుట్టుగ గ్రామానికి చెందిన దాసరి మోహన్‌రావు (50) శివమాల ధరించాడు. తన సహచర భక్తులు 12 మంది కలసి వాహనంలో శ్రీశైలం బయలుదేరారు. చద్ది సమయం కావటంతో స్నానం చేసేందుకు మార్గమధ్యంలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్ వద్దకు వెళ్లారు. కాల్వ మెట్ల మార్గంలో మోహన్‌రావు స్నానం చేస్తుండగా కాలు జారి కాల్వలో పడిపోయాడు. తోటి స్వాములు రక్షించటానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కెనాల్ నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో గల్లంతయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలు స్వాముల ద్వారా తెలుసుకున్నారు. మోహన్‌రావు వృత్తి రీత్యా అసోం రాష్ట్రంలోని విమానాశ్రయంలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. కళ్ల ఎదుటనే తన మిత్రుడు కాల్వలో గల్లంతు కావటంతో ఒక్కసారిగా సహచరులు శోకసముద్రంలోకి వెళ్లారు. విషయాన్ని పోలీసులు కుటుంబ సభ్యులకు సెల్‌ఫోను ద్వారా తెలిపారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య



సోంపేట: మండలంలోని బుసాభద్ర పంచాయతీ కాలనీలో వివాహిత కౌసల్య రౌలో (30) సోమవారం ఆత్మహత్య చేసుకుంది. బారువ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పంచనన్న రౌలో తన మొదటి భార్య మృతి చెందడంతో ఈదుపురం గ్రామానికి చెందిన కౌసల్య రౌలోను వివాహం చేసుకున్నాడు. అయితే పెళ్లి చేసుకున్నప్పటినుంచి కౌసల్యను భర్త వేధిస్తుండేవాడు. ఇటీవల గొడవలు మరింతగా పెరగడంతో, సోమవారం ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వీరికి పిల్లలు లేరు. కౌసల్య రౌలో సోదరి కున్ని రౌలో ఫిర్యాదు మేరకు బారువ ఎస్ఐ హరిబాబునాయుడు కేసు నమోదు చేశారు. భర్త పంచనన్న రౌలోను అదుపులోకి తీసుకున్నారు.

సౌదీలో మత్స్యకారుడు మృతి


మృతుడు కొరివి రామారావు

సంతబొమ్మాళి: మండలంలోని మరువాడ గ్రామానికి చెందిన కొరివి రామారావు (47) ఆదివారం రాత్రి కడుపు నొప్పితో సౌదీ అరేబియాలో మృతి చెందాడు. ఆ మేరకు తమకు సమాచారం ఇచ్చారని మృతుని సోదరుడు శ్రీనివాసరావు తెలిపారు. రామారావు మూడు నెలల కిందటే ఉపాధి కోసం సౌదీ వెళ్లారు. మృతుడికి భార్య పోలమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బెండి గెడ్డపై ఆనకట్ట..!

- పరిశీలించిన వంశధార డీఈ సుధాకర్


బెండి గెడ్డ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న వంశధార అధికారులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని బెండి జీవగెడ్డపై ఆనకట్ట నిర్మించి ఆ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు వంశధార డీఈ సుధాకర్ తెలిపారు. ఈ మేరకు బెండి, శివరాంపురం ప్రాంతాల్లోని రైతులతో కలిసి సోమవారం బెండిగెడ్డను పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బెండిగెడ్డపై ఎత్తిపోతల పథకం నిర్మించేందుకు రూ.9.3 కోట్లతో ఏపీఎస్ఐడీసీ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే ఎక్కువ ఖర్చు కావడంతో బెండిగెడ్డ, బట్టుపాడుకు మధ్యనున్న పాత ఆనకట్టకు దిగువన మరో ఆనకట్ట నిర్మించి, బెండి, సీతాపురం, పెద్దబొడ్డపాడు, కొండవూరు ప్రాంతాల్లోని ఎర్రచెరువు, రామసాగరం చెరువులకు వృథా జలాలు పంపిస్తే 800 ఎకరాలను సస్యశ్యామలం చేయవచ్చునని రైతులు చెబుతున్నారు. ఈ మేరకు రైతులు వినతిపత్రాలు అందించడంతో డీఈ సుధాకర్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. మరోపక్క ఉప్పుటేరు వల్ల స్థానికంగా ఉన్న తాగునీటి బావులు, బోరు బావులు కలుషితమవుతున్నాయని, అందువలన సముద్ర జలాలు బెండి గెడ్డలో కలవకుండా ఉండేందుకు నగరంపల్లి పంచాయతీ శివరాంపురం వద్ద ఆనకట్ట నిర్మించాలని ఆ ప్రాంత ప్రజలు కోరినందున, ఆ ప్రాంతాన్ని సైతం పరిశీలించినట్లు తెలిపారు. ఇక్కడ కూడా ఆనకట్ట నిర్మించే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో వంశధార ఏఈఈ తమ్మినేని రాజశేఖర్‌రాజు, మీనాక్షి, వంశధార డిస్ట్రిబ్యూషన్ కమిటీ అధ్యక్షుడు గొనప నిరంజన్, పెద్దబొడ్డపాడు సర్పంచ్ తమ్మినాన డిల్లీరావు, నీటి సంఘం అధ్యక్షుడు దాశరథి, డి.అప్పారావు, టి.బాలకృష్ణ, జయరాం తదితరులు పాల్గొన్నారు.